

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 17-04-2026 | సంపుటి - 27 | సంచిక -325 | రూ : 4 | పేజీలు: 8




### తెలంగాణలో టాప్ 3 కులాలు..

## నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో
- ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం
- దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం

2లో

## కొత్త దిశగా దేశం

- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు
- బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి

2లో





### ఏపీ, తెలంగాణ మధ్య

## కొత్త రైళ్లు: రూట్లివే!

- చర్లపల్లినర్సాపురం, నర్సాపురం తిరుపతి మధ్య కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- ఇప్పటికే ఉన్న ప్రత్యేక రైళ్లను రెగ్యులర్ సర్వీసులుగా మార్చిన రైల్వే శాఖ
- ఇండోర్‌లింగంపల్లిఇండోర్ హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి వరకు పొడిగింపు
- ఏప్రిల్ చివరి వారం నుంచే అమల్లోకి రానున్న కొత్త రైళ్లు, మార్పులు

2లో



### విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల్లో

## తెలంగాణ అగ్రగామి

- ఈ రంగాల్లో పెట్టుబడులకు ముందుకు రండి
- 'యుఎస్ నేషనల్ కాలేజ్ వార్' ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు

2లో

## 'లెక్క'కు మించి ఖర్చులు!

- సీఈఏ నిబంధనల కన్నా అధికంగా సిబ్బంది..
- విద్యుదుత్పత్తి వ్యయంపై నియంత్రణ ఏదీ!
- ప్రజలపైనే 'భారం'?

హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో లోపాల వల్ల విద్యుదుత్పత్తి వ్యయం పెరుగుతోంది. ప్రధానంగా పలు ప్లాంట్లలో ఉద్యోగుల నియామకాలు, పనివిభజనలో హేతుబద్ధీకరణ లోపించింది. దీంతో ఖర్చులు పెరిగి ఆ 'భారం' ప్రజలపై మోపే పరిస్థితులకు దారితీస్తోంది. ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్ల ఆర్థికభారం వల్లనే విద్యుదుత్పత్తి వ్యయం పెరిగిందని 'తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)'కి సమర్పించిన వార్షిక నివేదికలో రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) పేర్కొనడం గమనార్హం. 202425లో అన్నిరకాల జెన్‌కో ప్లాంట్లలో కలిపి నిర్వహణ తరువాయి 2లో




### తేజస్వి సూర్యపై పొన్నం

## ప్రభాకర్ ఆగ్రహం

- తెలంగాణ ఏర్పాటును భారత్‌పాక్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య
- తేజస్వి వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని పొన్నం డిమాండ్
- బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న

2లో





### అమెరికా స్థావరాలపై ఇరాన్ నిఘా..

## సాయం చేసిన చైనా శాటిలైట్!

- గతేడాది రహస్యంగా శాటిలైట్‌ను సమకూర్చుకున్న ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్
- సౌదీ, జోర్డాన్, ఇరాక్‌లోని యూఎస్ బేస్‌ల కదలికలను ట్రాక్ చేసిన వైనం
- చైనా ప్రభుత్వ అనుమతితోనే ఇది జరిగిందంటున్న నిపుణులు
- ఇరాన్‌కు సైనిక సాయం లేదంటూ కొట్టిపారేస్తున్న చైనా

2లో

### తెలంగాణ సమాజానికి

## తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి

- తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడంపై ఆగ్రహం
- తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉండటమేమిటని ప్రశ్న
- ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని మండిపాటు
- తెలంగాణ వ్యతిరేకత బీజేపీకి నరనరాన నిండి ఉందన్న కేటీఆర్
- తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బీజేపీ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

2లో




## ఢిల్లీ ఎయిర్ పోర్టులో ఢీకొన్న రెండు విమానాలు



- ట్యాక్సీయింగ్ చేస్తుండగా ఆకాశ ఎయిర్ విమానాన్ని ఢీకొట్టిన స్పైస్‌జెట్ ఫ్లైట్
- హైదరాబాద్‌కు వెళ్లాల్సిన విమానానికి తప్పిన ప్రమాదం
- ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితం
- ఘటనపై విచారణకు ఆదేశించే అవకాశం

2లో

# ఏపీ, తెలంగాణ మధ్య కొత్త రైళ్లు: రూట్లివే!

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ప్రయాణించే రైల్వే ప్రయాణికులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు కొత్త వారపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే నడుస్తున్న కొన్ని ప్రత్యేక రైళ్లను క్రమబద్ధీకరించడంతో పాటు మరికొన్ని రైళ్ల సేవలను పొడిగించింది. దక్షిణ మధ్య రైల్వే విడుదల చేసిన వివరాల ప్రకారం చర్లపల్లినర్సాపురంచర్లపల్లి (17061/17062) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కొత్తగా ప్రకటించారు. ఇది ఇప్పటివరకు నడుస్తున్న ప్రత్యేక రైలు స్థానంలో రెగ్యులర్ సర్వీసుగా నడుస్తుంది. మే 2 నుంచి ప్రతి శనివారం రాత్రి 7:50 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నర్సాపురంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:50 గంటలకు చర్లపల్లికి వస్తుంది. ఈ రైలు నల్గొండ, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. అలాగే, నర్సాపురంతిరుపతినర్సాపురం (17428/17427) మధ్య మరో వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా ప్రవేశపెట్టారు. ఏప్రిల్ 27 నుంచి ప్రతి సోమవారం సాయంత్రం 3:50 గంటలకు నర్సాపురంలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3:40 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మే 3 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 10:10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9:30 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. ఇతర రైళ్ల సేవల్లో మార్పులు వీటితో పాటు రైల్వే బోర్డు మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇండోర్‌లింగంపల్లి హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను (20916/20915) చర్లపల్లి వరకు పొడిగించారు. ఈ మార్పు ఏప్రిల్ 25 నుంచి అమల్లోకి వస్తుంది. కాకినాడ టౌన్ లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌ను (12775/12776) వారానికి మూడు రోజుల నుంచి రోజువారీ సర్వీసుగా మార్చారు. ఈ రైలుకు సామర్లకోటలో అదనపు హాల్ట్‌ను కూడా కేటాయించారు. ఈ మార్పులు ఏప్రిల్ 21 నుంచే అమల్లోకి రానున్నాయి. ఈ కొత్త రైళ్లు, మార్పులతో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది.

## ఢిల్లీ ఎయిర్ పోర్టులో
# ఢీకొన్న రెండు విమానాలు

దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం సాయంత్రం పెను ప్రమాదం తృటిలో తప్పింది. ట్యాక్సీ వేపై ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్‌కు చెందిన రెండు విమానాలు ఒకదానికొకటి స్వల్పంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడటంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విమానాశ్రయ వర్గాల సమాచారం ప్రకారం, స్పైస్‌జెట్‌కు చెందిన బోయింగ్ బీ737700 విమానం ట్యాక్సీయింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో హైదరాబాద్‌కు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న ఆకాశ ఎయిర్ విమానం క్యూపీ 1406 నిలిపి ఉంది. వేగంగా వస్తున్న స్పైస్‌జెట్ విమానం కుడి రెక్క (రైట్ వింగ్), నిలిపి ఉన్న ఆకాశ విమానం తోక భాగంలోని స్టెబిలైజర్‌ను తాకింది. దీంతో రెండు విమానాల భాగాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై ఆకాశ ఎయిర్ వెంటనే స్పందించింది. తమ విమానం ఆగి ఉన్నప్పుడు మరో విమానం వచ్చి ఢీకొట్టినట్లు ప్రాథమికంగా తెలిసిందని సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. "ప్రయాణికులు, సిబ్బంది అందరినీ సురక్షితంగా విమానం నుంచి దించాం. హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. ఈ ఘటన కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో విమాన రాకపోకలకు పెద్దగా అంతరాయం కలగలేదు. అయితే, దెబ్బతిన్న రెండు విమానాలను అధికారులు పరిశీలన కోసం బేకు తరలించారు. ఈ ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విచారణ జరిపే అవకాశం ఉంది.

# కొత్త దిశగా దేశం

మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ @2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

# 'లెక్క'కు మించి ఖర్చులు!

హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో లోపాల వల్ల విద్యుదుత్పత్తి వ్యయం పెరుగుతోంది. ప్రధానంగా పలు ప్లాంట్లలో ఉద్యోగుల నియామకాలు, పనివిభజనలో హేతుబద్ధీకరణ లోపించింది. దీంతో ఖర్చులు పెరిగి ఆ 'భారం' ప్రజలపై మోపే పరిస్థితులకు దారితీస్తోంది. ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్ల ఆర్థికభారం వల్లనే విద్యుదుత్పత్తి వ్యయం పెరిగిందని 'తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)'కి సమర్పించిన వార్షిక నివేదికలో రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) పేర్కొనడం గమనార్హం. 202425లో అన్నిరకాల జెన్‌కో ప్లాంట్లలో కలిపి నిర్వహణ వ్యయం రూ.1,869.03 కోట్లకు ఈఆర్‌సీ తొలుత అనుమతిస్తే ఏకంగా రూ.2,700 కోట్లు ఖర్చయినట్లు జెన్‌కో తెలిపింది. దీనిపై విచారణ జరిపిన ఈఆర్‌సీ చివరికి రూ.2,291 కోట్లకు మాత్రమే అనుమతించింది. పాల్వంచలోని 5, 6 దశల్లో నిర్మించిన వెయ్యి మెగావాట్ల ప్లాంట్ల నిర్వహణ వ్యయం కింద 202425లో ఈఆర్‌సీ రూ.513.96 కోట్లకు అనుమతిస్తే అంతకన్నా రూ.147.34 కోట్లు అదనంగా ఖర్చయిందని దీన్ని ప్రజలు కొనే కరెంటుపై మోపేందుకు అనుమతించాలని జెన్‌కో కోరింది. ఈ రెండు ప్లాంట్లలో శాశ్వత ఉద్యోగులతోపాటు, ఆర్టిజన్ల పేరుతో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బంది కలిపి మొత్తం 2,399 మంది పనిచేస్తున్నారు. అంటే ఒక మెగావాట్‌కు సగటున దాదాపు 2.4% మంది ఉన్నట్లు లెక్క. కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) నిబంధనలకన్నా ఇది రెండు రెట్లు ఎక్కువ. అలాగే భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ కేంద్రానికి ఈఆర్‌సీ రూ.385 కోట్లకు అనుమతిస్తే అదనంగా రూ.130 కోట్లు ఖర్చుపెట్టారు. ఇక్కడా అదనంగా ఉద్యోగులున్నారు.

**జెన్‌కో ప్లాంట్లలో ఉద్యోగుల సంఖ్య**

| ఎక్కడ | ఉత్పత్తి సామర్థ్యం (మెగావాట్లు) | శాశ్వత ఉద్యోగులు | తాత్కాలిక సిబ్బంది |
|---|---|---|---|
| పాల్వంచ (5, 6 దశలు) | 1,000 | 1,026 | 1,373 |
| బయ్యారం (భద్రాద్రి) | 1,080 | 1,111 | 6 |
| దామెరచర్ల (యాదాద్రి) | 4,000 | 1,210 | 3 |
| భూపాలపల్లి (కేటీపీపీ) | 1,200 | 1,081 | 809 |
| పాల్వంచ (7వ దశ) | 800 | 1,103 | 729 |
| నాగార్జునసాగర్ | 900 | 271 | 114 |
| శ్రీశైలం | 900 | 218 | 139 |
| రామగుండం (మూతపడింది) | 62 | 232 | 49 |

**0.8% ఉద్యోగులే ఉండాలి..**

సీఈఏ నిబంధనల ప్రకారం ప్రతి ప్లాంటు స్థాపిత ఉత్పత్తి సామర్థ్యంలో ఒక మెగావాట్‌కు సగటున 0.8 శాతం చొప్పున ఉద్యోగులుండాలి. అంటే వెయ్యి మెగావాట్ల ప్లాంటుకు సగటున 800 మంది మాత్రమే పనిచేయాలి. ఎన్టీపీసీ ప్లాంట్లలో వెయ్యి మెగావాట్లకు సగటున 280 మంది మాత్రమే (0.28%) ఉన్నారు. తెలంగాణ జెన్‌కో ప్లాంట్లలో మాత్రం శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య ఒక్కోచోట ఒక్కోరకంగా ఉంది. కొన్నిచోట్ల సీఈఏ నిబంధనల కన్నా ఎక్కువగా ఉంటే, మరికొన్ని ప్లాంట్లలో ఆ స్థాయిలో లేరు. రామగుండంలో అయితే గతఏడాది మూతపడిన 62 మెగావాట్ల థర్మల్‌ప్లాంటులో 200 మందికిపైగా ఉద్యోగులకు ఏ పనీ లేకున్నా నెలనెలా జెన్‌కో జీతభత్యాలు చెల్లిస్తోంది. వీరిని వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలనుకున్నా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. తెలంగాణ విద్యుత్ ప్లాంట్లలో ఉద్యోగుల సంఖ్య, నియామకాలకు సంబంధించి హేతుబద్ధీకరణ జరగలేదని ఇంజినీర్లు చెబుతున్నారు. విద్యుదుత్పత్తి వ్యయం బాగా పెరగడంతో తెలంగాణ జెన్‌కో ప్లాంట్ల నుంచి కాకుండా.. బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు కరెంటును కొంటున్నట్లు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ఈఆర్‌సీకిచ్చిన నివేదికలో పేర్కొనడం గమనార్హం.

# తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలు ఈరోజు ఎంపీ తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడలేదని అన్నారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమని అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వీ సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వీ సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల్లో తెలంగాణ అగ్రగామి

హైదరాబాద్: విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో గురువారం 'యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' బృంద సభ్యులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి సానుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలను మంత్రి శ్రీధర్‌బాబు వారికి వివరించారు. ''రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు.. యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు.. అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోంది. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధి రేటును నమోదు చేస్తోంది. లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్‌బస్, దస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో.. డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్, ఆర్‌సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ప్రిసిషన్ ఇంజినీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్‌డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం.. ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారింది. టీజీఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నాం. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తాం'' అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

# అమెరికా స్థావరాలపై ఇరాన్ నిఘా.. సాయం చేసిన చైనా శాటిలైట్!

పశ్చిమాసియాలో ఇటీవల ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సమయంలో అమెరికా సైనిక స్థావరాలపై నిఘా పెట్టేందుకు ఇరాన్ చైనా తయారీ శాటిలైట్‌ను ఉపయోగించుకుందని ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఈ పరిణామం గల్ఫ్ దేశాల్లో తీవ్ర ఆందోళనలకు కారణమవుతోంది. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం, గతేడాది ఇరాన్ రహస్యంగా పొందిన ఈ శాటిలైట్ పేరు TEE01B. దీనిని చైనాకు చెందిన 'ఎర్త్ ఐ కంపెనీ' అభివృద్ధి చేసి ప్రయోగించింది. అనంతరం ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఏరోస్పేస్ విభాగానికి దీనిని అప్పగించారు. కక్ష్యలోకి విజయవంతంగా చేరిన తర్వాతే విదేశీ కొనుగోలుదారులకు ఉపగ్రహాలను బదిలీ చేసే 'ఇన్‌ఆర్బిట్ డెలివరీ' అనే పద్ధతిలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా బీజింగ్‌కు చెందిన ఎంపోశాట్ అనే మరో సంస్థకు చెందిన కమర్షియల్ గ్రౌండ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను కూడా ఇరాన్ వినియోగించుకునేందుకు అనుమతి లభించింది. ఈ శాటిలైట్‌ను ఉపయోగించి పశ్చిమాసియాలోని కీలకమైన అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ నిఘా పెట్టింది. మార్చి 13, 14, 15 తేదీల్లో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ చిత్రాలను ఈ శాటిలైట్ బంధించింది. అదే సమయంలో జోర్డాన్‌లోని మువాఫక్ సల్తీ ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో ఫ్లీట్ హెడ్ క్వార్టర్స్ సమీప ప్రాంతాలు, ఇరాక్‌లోని ఎర్బిల్ ఎయిర్‌పోర్ట్ వద్ద కార్యకలాపాలను కూడా ట్రాక్ చేసినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. కువైట్‌లోని క్యాంప్ బ్యూహ్రింగ్, అలీ అల్ సేలం ఎయిర్ బేస్ వంటి అమెరికా సంబంధిత స్థావరాలు కూడా దీని నిఘా నీడలోనే ఉన్నాయి. "చైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ చైనా కంపెనీ ఇలాంటి ఉపగ్రహాన్ని ప్రయోగించడం అసాధ్యం. చైనా చాలా కాలంగా ఇరాన్‌కు నిఘా సమాచారంతో సాయం చేస్తోంది, అయితే ప్రభుత్వ ప్రమేయం బయటపడకుండా జాగ్రత్త పడుతోంది" అని పాశ్చాత్య దేశాలకు చెందిన ఓ మాజీ సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి వ్యాఖ్యానించారు. అయితే, ఇరాన్‌కు ఎలాంటి సైనిక మద్దతు ఇవ్వడం లేదని చైనా విదేశాంగ శాఖ గత కొన్ని రోజులుగా ఖండిస్తూ వస్తోంది. చైనా చాలా కాలంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి మద్దతు ఇస్తోందని, క్షిపణుల తయారీకి ఉపయోగపడే ద్వంద్వ వినియోగ పారిశ్రామిక భాగాలను అందిస్తోందని అమెరికా ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనాఇరాన్ బంధంపై గల్ఫ్ దేశాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే... నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (No Caste) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.

# తేజస్వి సూర్యపై పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ తేజస్వి సూర్యపై నిప్పులు చెరిగారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు అత్యంత అజ్ఞానంతో కూడుకున్నవని, అవి ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్ని అవమానించినందుకు ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ డీఎన్ఏ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వ్యాఖ్యలను ఖండించాలని పొన్నం పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవాన్ని కించపరిస్తే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అని ఆయన నిలదీశారు. తెలంగాణ ఏర్పాటు అనేది దశాబ్దాల పోరాటమని, వేలాది మంది త్యాగాల ఫలితమని, దానిని విద్వేషపూరిత విభజనతో పోల్చడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. తేజస్వి సూర్యకు తెలంగాణ చరిత్రపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఒక జాతీయ పార్టీకి చెందిన ఎంపీ ఇంత బాధ్యతారాహిత్యంతో మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

# రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులను జారీ చేస్తాం

* జీవో 252 లో అవసరమైన మేరకు సవరణలు చేస్తాం
* జర్నలిజంతో సంబంధం లేనివారికి అక్రెడిటేషన్లు జారీ కాకుండ చూడాలి
* ఎలైట్ పీపుల్స్ నుంచి జర్నలిస్టులను తొలగించాలి
* తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి











ప్రజాస్ఫూర్తి, మేడ్చెల్ జిల్లా : మేడ్చల్: రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టుల అభ్యర్థన మేరకు 252 జీవోలో, అవసరమైన మేరకు సవరణలు చేసి డిపిఆర్ఓలకు పంపిస్తామని చెప్పారు. గురువారం మేడ్చల్ జిల్లాలోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ లో టియుడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మీడియా అకాడమీ చేర్మెన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టులకు జారీ చేసే అక్రెడిటేషన్ కార్డుల విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని సూచించారు. గతంలో కంటే మెరుగైన జీవోను ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. సర్క్యులేషన్ ప్రాతిపదికన కార్డులను రాష్ట్ర, జిల్లా స్థాయిలో జారీ చేస్తారని అన్నారు. కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు జారీ చేసే కార్డుల విషయమై సబ్ కమిటీ వేశామని ఆ కమిటీ నివేదిక మేరకు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. పెద్ద పత్రికల జర్నలిస్టులేవరికీ అన్యాయం జరగదని, ఆయా పత్రికల్లో డెస్క్ సబ్ ఎడిటర్లుగా పనిచేస్తున్న వారందరికి అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేస్తారని అన్నారు. జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారికి అక్రెడిటేషన్లు జారీ కాకుండా యూనియన్ బాధ్యులు జాగ్రత్త వహించాలని సూచించారు. నకిలీ జర్నలిస్టులకు కార్డులు అందకుండా అడ్డుకోవాలని అన్నారు. అక్రెడిటేషన్ కమిటీ సభ్యులకు త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి వారికి కూడా అవగాహన కల్పిస్తామన్నారు. హైదరాబాద్ లోని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇచ్చినటువంటి ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు అభ్యంతరకరమైందని, ఐఏఎస్, ఐపిఎస్ లు, ఎమ్మెల్యేల జీవితాలతో జర్నలిస్టులను పోల్చడం అభ్యంతర కరమైందన్నారు. జర్నలిస్టులు ఉన్నత వర్గాలు కాదని, ఇటీవల విజయవాడలో జరిగిన ఐజేయు ప్లీనరీ సమావేశంలో తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ సంఘం సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లాలని, సంఘం బలోపేతం కోసం పాటుపడాలని, సభ్యుల సంఖ్య ముఖ్యం కాదని, పనిచేయడం ముఖ్యమన్నారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు అందే విధంగా పాటుపడాలన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ మాట్లాడుతూ, ఆయా జిల్లాల్లో నిర్వహించాల్సిన మహా సభలను మే 15లోగా నిర్వహించాలని మరికొన్ని జిల్లాల సభలను జూన్ 15 లోపు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులు వచ్చే విధంగా యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. అంతకుముందు మూడు మాసాల కాలంలో ప్రమాదాలు, అనారోగ్య కారణాలవల్ల మరణించిన 16 మంది జర్నలిస్టులకు నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాంనారాయణ తన నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు కూడా వైద్య సదుపాయాన్ని కల్పించాలని, ఐజేయు ప్లీనరీలో చేసిన తీర్మానం మేరకు హైదరాబాద్ లో జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సును ఏర్పాటు చేయాలని, జాతీయ న్యూస్ పేపర్స్ కన్ఫడరేషన్ జాతీయ సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహించాలని తీర్మానించారు. అలాగే రాష్ట్రంలో జర్నలిస్టులపై నమోదవుతున్న కేసులపై నిజానిర్ధారణ చేసేందుకు గాను, సీనియర్ పాత్రికేయులతో త్రిసభ్య కమిటీని నియమించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశ నిర్వహణకు మేడ్చల్ జిల్లా కమిటీ ఆతిథ్యాన్ని ఇచ్చింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గంతో పాటు 29 జిల్లాల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఇంకా ఈ సమావేశంలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ మాజీద్, జాతీయ ఉపాధ్యక్షులు వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, కే సత్యనారాయణ, అజిత, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే. రాములు, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైసల్ అహ్మద్, బుర్ర సంపత్ కుమార్ గౌడ్, గాడిపల్లి మధు, రాష్ట్ర కార్యదర్శులు వరకాల యాదగిరి, శ్రీకాంత్ రెడ్డి, గుండ్రాతి మధు గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి.బాల్ రాజ్ గౌడ్, కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

**నందిని సిద్ధారెడ్డికి సన్మానం..**

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన నందిని సిద్ధారెడ్డిని టియూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గం ఘనంగా సన్మానించింది. గురువారం అంతాయిపల్లిలోని ఎస్ ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన టి యు డబ్ల్యూ జే రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన 55 ఏళ్ల సాహిత్య జీవితంలో టి యు డబ్ల్యూజె తో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని ఆయన గుర్తు చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు.

## చేనేత కార్మికులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


* స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు



భువనగిరి ,ప్రజాస్ఫూర్తి : జిల్లా లో ఉన్న చేనేత కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వైద్య శిబిరాలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం గౌడ సంఘ భవనం, ఆలేరు వద్ద చేనేత కార్మికులకు "ఆరోగ్య భరోసా" కార్యక్రమం నిర్వహించారు. చేనేత చేతి మగ్గాల ద్వారా పట్టు దారాలతో వస్త్రాలను నేసే వృత్తి. ఈ వృత్తిని సాంస్కృతిక వారసత్వంగా కొనసాగిస్తున్న చేనేత కార్మికులకు ఆరోగ్య భరోసా కల్పించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రం, ఆరోగ్య శాఖ , జిల్లా హ్యాండ్లూమ్ & టెక్స్టైల్స్ శాఖ, యాదాద్రి భువనగిరి వారి సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలేర్ మునిసిపల్ చైర్పర్సన్ బాలమణి భాస్కర్ ప్రారంభించారు.జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచనలతో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందనీ అన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘ భవనంలో చేనేత కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు , ల్యాబ్ పరీక్షలు అందించారు. చేనేత కార్మికులకు హెల్త్ కార్డులు పంపిణీ చేయబడగా, అవసరమైన ఔషధాలు అందించారు. ప్రతి కార్మికుడు పూర్తి వైద్య వివరాలు హెల్త్ కార్డులో నమోదు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా చేనేత కార్మికుల ఆరోగ్య స్థితిపై సమగ్ర అవగాహన ఏర్పడిందని తెలిపారు..అధికారులు చేనేత కార్మికులు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతు చేనేత కార్మికులు వృత్తిపరంగా అనేక శరీరక సమస్యలు వస్తాయని వీరికోసం మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వైద్యాధికారి డా. మనోహర్, మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చికిత్స తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆంజనేయులు, డీఆర్డిఎ పీడి నాగి రెడ్డి , ఎడి (హ్యాండ్లూమ్, టెక్స్టైల్) శ్రీనివాస్ , వైబీడి జిల్లా ప్రోగ్రాం అధికారులు, మునిసిపల్ కౌన్సిలర్లు , పట్టణ చేనేత సంఘం సభ్యులు , మునిసిపల్ కమిషనర్, ఆలేర్ శ్రీనివాస్ రెడ్డి , మెడికల్ ఆఫీసర్, శరాజీపేట డా. హైమవతి , ఇతర ఆరోగ్య సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు దోహదం

* బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి :వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ సుచిత్ర చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు జలిగం రాకేష్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఏసీపీ వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటు -ప్రజల దాహార్తిని తీర్చేందుకు తోడ్పాటు అని, చలివేంద్రాల ద్వారా ప్రజలకు సేవచేయడం ఆ దైవానికి సేవ చేసినట్టేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జీడిమెట్ల డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు, కుత్బుల్లాపూర్ డివిజన్ నాయకులు నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేయాలి

– 16వ డివిజన్ కార్పొరేటర్ మునగడప పద్మ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పోషకాహారం, విద్య, ఆరోగ్యం పట్ల అంగన్వాడి టీచర్లు, ఆయాల శ్రమ వెల కట్టలేనిదని 16 వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ కొనియాడారు. గురువారం 16వ డివిజన్ నెహ్రూ బస్తీ సెంటర్లో జరిగిన పోషణ్ పక్వాడ్ లో భాగంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం తల్లి, పిల్లలు తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన సమాజాన్ని నెలకొల్పవచ్చు అన్నారు. కార్పొరేట్ శక్తులు విద్యను వ్యాపారం చేసే ఈ రోజుల్లో అంగన్వాడి కేంద్రాల్లో టీచర్లు పిల్లలకు పోషకాహారం, విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ వారిని ఆరోగ్యకరమైన పిల్లలుగా తయారు చేస్తున్నారన్నారు. అనంతరం సెంటర్లో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక విలువలతో కూడిన పోషకాహార ప్రదర్శన నిర్వహించి పిల్లలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి, అంగన్వాడీ టీచర్స్ సరోజ, డి.నీలవేణి, షహనాజ్, దేవి, రజిత, ఆయాలు వెంకటలక్ష్మీ, కౌసల్య, కొమరమ్మ, తల్లిదండ్రులు తీట్ల దివాకర్, కంచర్ల శ్రావణి, సంతోషి, ఎస్ కే ఫైజా, జాన్ నవీన్, జి రుత్విక్, రవి, విన్సీ, ప్రసన్న, జి నాగలక్ష్మీ , లీల, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఠారెత్తిస్తున్న ఎండలు.. ఆదిలాబాద్‌లో 43.8 డిగ్రీల నమోదు

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 43.8 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లాలో 42.7, మహబూబ్‌నగర్‌లో 42, రామగుండంలో 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్ర, శనివారాల్లోనూ ఉత్తర, దక్షిణ తెలంగాణలో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపీ 1 నుంచి 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. మరోవైపు ఈ నెల 19 నుంచి 23 వరకు ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దిగువస్థాయి గాలుల్లో మార్పు, క్యుములోనింబస్ మేఘాలు, ద్రోణి ప్రభావాలతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. వడగండ్లు కూడా పడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

## బృహత్తర ప్రాజెక్టు నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

* షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, వారి విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి చేర్చేందుకు షాద్ నగర్ నియోజకవర్గంలో ఒక బృహత్తర ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ప్రతి ఒక్కరు ఈ నిర్మాణ పనుల్లో భాగస్వాములు కావాలని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు గ్రామంలో సువిశాల విస్తీర్ణంలో రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులపై మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, ఎంపీడీవో అనురాధ, ఎమ్మార్వో అజమ్ అలీ, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి మల్లేష్, మండల నాయకులు గోవర్ధన్, కాంట్రాక్టర్ విక్రమ్, స్థానిక నాయకులు కుమార్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంద్రాతి బాలరాజు గౌడ్, పార్లమెంటరీ నాయకుడు పురుషోత్తం రెడ్డి, సర్పంచ్ పురుషోత్తం రెడ్డి తదితరులు ఎమ్మెల్యే శంకర్ వెంట సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుందనీ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేసి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేశారని గుర్తు చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఓ మినీ యూనివర్సిటీగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కాబోతుందని అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించి నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తనకు తెలియజేయాలని కోరారునేటి పోటీ ప్రపంచంలో నాణ్యమైన విద్య కోసం పేద తల్లిదండ్రులు తమ స్తోమతకు మించి అప్పులు చేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారనీ ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి వస్తే, రూపాయి ఖర్చు లేకుండా అత్యున్నత స్థాయి బోధన, భోజన, వసతి సౌకర్యాలు లభిస్తాయన్నారు. ఇది వేలాది కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద ఊరటనివ్వనుందనీ తెలిపారు.

## నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నాను నిర్వహించాలి

* జిల్లా జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ఉద్యోగ గెజిటెడ్ అధికారులు ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నెల 17న తలపెట్టనున్న మండల, డివిజన్, జిల్లా స్థాయిలోని ఉద్యోగులు కార్యాలయము నందు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు యాదాద్రి భువనగిరి జిల్లా జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, సెక్రటరీ జనరల్ భగత్ సారథ్యంలో జిల్లాలోని అన్ని ఉద్యోగ సంఘాలతో సన్నాహక సమావేశం స్థానిక జిల్లా ఐడిఓసి నందు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ 2023 నుండి ఉద్యోగులకు రావాల్సిన రెండవ పిఆర్సిని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల 13 వేల కోట్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగులకు ఈహెచ్ఎస్ ను వెంటనే అమలు చేయాలని, కొత్త పెన్షన్ విధానమును (సీపీఎస్ ) రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానమును (ఓపీఎస్ ) ను యధావిధిగా అమలు చేయాలని, అనే అంశము మీద ఈ నెల 17న ఉద్యోగుల భోజన విరామ సమయంలో జరిగే ధర్నా కార్యక్రమమును మండల స్థాయి/ డివిజన్ స్థాయి/ జిల్లా స్థాయిలలో పెద్ద ఎత్తున ఉద్యోగులు గెజిటెడ్ ఆఫీసర్స్ పాల్గొనాలని సన్నాహక సమావేశం నందు తీర్మానము చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు భగత్, పి ఆర్ టి యు అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, కార్యదర్శి యుటిఎఫ్ అధ్యక్షులు యాదయ్య, భువనగిరి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు జగన్మోహన్ ప్రసాద్, కార్యదర్శి శ్రీనివాస్, ట్రస్మా అధ్యక్షులు కృష్ణ, టీఎన్జీవో నాయకులు శ్రీకాంత్, శశికాంత్, డి.టి.ఎఫ్ లక్ష్మీ నరసింహ, శైలజ, శ్రీనివాస్, డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి లింగయ్య, దుర్గాప్రసాద్, యుఐఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు నర్సిరెడ్డి సభ్యులు పాల్గొన్నారు.



## ఆర్టిజన్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

నల్లగొండ , ప్రజాస్ఫూర్తి. : టీవీ ఏఈ జెఏసి రాష్ట్ర కమిటీ పిలుపు నిరవధిక సమ్మెలో భాగంగా తొమ్మిదవ రోజు గురువారం ఆర్టిజన్ కార్మికులు అర్ధనజ్ఞ ప్రదర్శనతో ప్రభుత్వానికి నిరసన తెలిపారు. అర్చన ప్రదర్శనకు బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ ప్రదర్శనకు అర్జెంట్ కార్మికులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ సందర్భంగా టీవీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఇట్టబోయిన లింగస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం యాజమాన్యం కార్మికులను సమస్యలపై స్పందించకుండా వారిని టెర్మినేట్ చేస్తామని భయభ్రాంతులకు గురి చేయడం చేసిన వారి మొండి వైఖరిని ఖండిస్తూ కార్మికులు వారి బెదిరింపులకు గురికాకుండా అధిక సంఖ్యలో పాల్గొని 9వ రోజు దీక్షను విజయవంతం చేయడం జరిగిందన్నారు ..ప్రభుత్వం వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానాలను వెంటబెడుతూ కార్మికులకు రావలసిన న్యాయమైన డిమాండ్లను వారికి ఇచ్చే విధంగా బిజెపి పార్టీ తరఫున మీకు పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా 8వ రోజు మేనేజ్మెంట్ జేఏసీతో చర్చలు జరిపిన విఫలం కావడంతో ఒక కార్మికుడు గోడ కొమ్మలు అనే వ్యక్తి మనస్థాపంతో గుండె పోటు రావడంతో చనిపోవడం జరిగిందని . ఈరోజు వారికి ఆత్మకు శాంతి కలగాలని ఒక రెండు నిమిషాలు మౌనం పాటించి ఈరోజు దీక్షలో 12 మంది ఒకరోజు నిరాహార దీక్ష లో అర్థ నగ్న ప్రదర్శన చేయటం జరిగిందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జిట్టబోయిన లింగస్వామి జిల్లా నాయకులు లింగారెడ్డి, అద్దంకి వెంకన్న, పోతపాక విజయ్ కుమార్, కోటి,విజయ్ రెడ్డి,పరమేష్ , ఉపేందర్,రమేష్,వెంకన్న ,లచ్చిరెడ్డి ,వెంకట్ రెడ్డి,పెరిక శేఖర్ ,రఫియా, ప్రసన్నకుమార్,అరుణ,లక్ష్మి, శైలజ,రాజేష్, మైల సైదులు నాగమణి, కరుణ,కళావతి,ఆరీఫా,భారతి,నాగార్జున , కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అలాగైతే రాష్ట్రం ఏర్పాటుకు భాజపా ఎందుకు మద్దతిచ్చింది? : హరీశ్‌రావు

హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటును ఇండియా పాకిస్థాన్ విభజనతో పోల్చిన భాజపా ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రజలను అవమానించారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన ఇండియాపాక్ విభజన లాంటిదైతే భాజపా ఎందుకు మద్దతు తెలిపిందని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ''తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం దశాబ్దాల పోరాట ప్రతిఫలం. వేలాది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజల త్యాగాల ఫలితం. మహోన్నత ఉద్యమాన్ని విద్వేషపూరిత విభజనతో పోల్చడం అవమానించడమే. తేజస్వి వ్యాఖ్యలపై భాజపా అధిష్ఠానం వైఖరి ఏంటో చెప్పాలి. ప్రధాని కూడా ఎన్నోసార్లు తెలంగాణ ఏర్పాటుపై విషం చిమ్మారు. భాజపా, కాంగ్రెస్ ఎంపీలు గుడ్లప్పగించి చూడటం సిగ్గుచేటు'' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

# ఏపీలో 38, తెలంగాణలో 26 స్థానాలు: అమిత్ షా



న్యూఢిల్లీ: డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. "తెలంగాణలో ప్రస్తుత లోక్‌సభ సీట్లు 3.13శాతంగా ఉన్నాయి. 26కు పెంచాక మొత్తం సీట్లలో తెలంగాణ శాతం 3.18కు పెరుగుతుంది. దక్షిణాదిలో మొత్తం ఎంపీ స్థానాలు 129 (23.76శాతం) నుంచి 195 (23.97శాతం)కు పెరుగుతాయి. దక్షిణాదికి అన్యాయం ఎలా జరుగుతుందో సభ్యులు చెప్పాలి. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. మొత్తం సీట్లలో 33శాతం మహిళలకు రిజర్వ్ అవుతాయి. జనరల్ స్థానాల్లోనూ మహిళలకు అవకాశమిస్తే వారి ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు.

**సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం - డీఎంకే**

ఒకవేళ డీలిమిటేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే.. సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని డీఎంకే పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల కోసం న్యాయపోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ న్యాయ వ్యవహారాల కార్యదర్శి ఎన్.ఆర్. ఎలాంగో పేర్కొన్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి పార్లమెంటులో మౌఖికంగా మాత్రమే హామీ ఇచ్చారన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలను బిల్లులో స్పష్టంగా పేర్కొనాల్సి ఉన్నప్పటికీ అలా జరగలేదని, కోర్టును ఆశ్రయించడానికి సరైన కారణాలు ఉన్నాయన్నారు.

**మహిళా కోటా అమలు చేయండి - ఠాక్రే**

మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని శివసేన (యూబీటీ) చీఫ్, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. అయితే, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మాత్రం తాత్కాలికంగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇది ఏ ఒక్క పార్టీ భవిష్యత్తుకు సంబంధించినది కాదని, దేశ భవిష్యత్తుకు చెందినదన్నారు. దీనిపై విస్తృత స్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఠాక్రే స్పష్టం చేశారు.

## పెళ్లికి సవర బంగారం, రైతులకు రుణ మాఫీ.. విజయ్ మ్యానిఫెస్టో

చెన్నై : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టీవీకే అధినేత, నటుడు విజయ్ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే.. 60ఏళ్ల లోపు ఉన్న మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం, పేద అమ్మాయిల వివాహాలకు సవర (ఎనిమిది గ్రాముల బంగారం), నాణ్యమైన పట్టు చీర కానుకగా ఇస్తామని హామీ ఇచ్చారు. స్వయం సహాయక బృందాలకు రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో డ్రాప్‌ఔట్‌లను నిర్మూలించేందుకు విద్యార్థుల తల్లులకు



ఏడాదికి రూ.15000 ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రైతులపైనా విజయ్ వరాల హామీలు కురిపించారు.

- * ఐదు ఎకరాల కన్నా తక్కువ భూమి ఉన్న రైతుల వ్యవసాయ రుణాల మాఫీ
- * ఐదు ఎకరాల కన్నా ఎక్కువ ఉన్నవారికి 50శాతం మాఫీ
- * కనీస మద్దతు ధర వరికి క్వింటాలుకు రూ.3500, చెరకుకు రూ.4500
- * కుటుంబానికి ఏడాదికి ఆరు ఉచితంగా సిలిండర్లు
- * ఏఐ మంత్రిత్వశాఖ, ఏఐ యూనివర్సిటీ, ఏఐ సిటీ ఏర్పాటు
- * పట్టభద్రులైన నిరుద్యోగులకు నెలకు రూ.4వేల ఆర్థిక సాయం
- * కొత్తగా ఐదు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు
- * వృద్ధులు, దివ్యాంగులకు రూ.3వేల పింఛను
- * 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు
- * కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్య బీమా వంటి తదితర హామీలను ప్రకటించారు.

## సుస్థిర, సుదీర్ఘ శాంతికి ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: ఏప్రిల్ 16 : పశ్చిమాసియా, ఉక్రెయిన్ ప్రాంతాల్లో సుస్థిర, సుదీర్ఘ శాంతికి ప్రధాన మంత్రి మోదీ పిలుపునిచ్చారు. ఆస్ట్రియన్ ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్‌తో కలిసి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. "కొన్నిదేశాల యుద్ధం కారణంగా ప్రపంచం మొత్తం ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆ ప్రభావం మనందరిపై పడుతోంది. ఈ సైనిక ఘర్షణలకు ఇంకా పరిష్కారం లభించలేదు. అది ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా శాశ్వత శాంతి, సుస్థిరత కావాలని కోరుకుంటున్నాం. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి సంస్కరణలు చేపట్టాలి. ఇందుకోసం ఉగ్రవాదాన్ని పారదోలడం ఎంతైనా అవసరం" అని మోదీ



పేర్కొన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత ఆస్ట్రియా ఛాన్సెలర్ రాకతో భారత్‌లో వాణిజ్య, పెట్టుబడుల రంగంలో నూతనోత్సాహం మొదలైందని మోదీ తెలిపారు. భారత్ ఈయూ మధ్య కొత్త ఒప్పందాలతో సువర్ణాధ్యాయం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు నాలుగురోజుల పాటు భారత్‌లో పర్యటిస్తున్నారు.

## రిజర్వేషన్లతో.. లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు

న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ల అమలుతో ఏ రాష్ట్రానికి గానీ, పురుషులకు గానీ ఎలాంటి నష్టం జరగదని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం 3 కీలక బిల్లులను లోక్‌సభ లో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అనంతరం వీటిపై చర్చ ప్రారంభించగా.. కేంద్రమంత్రి మేఘ్‌వాల్ ప్రసంగించారు. ఈ బిల్లులతో లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని అన్నారు. "పార్లమెంట్ చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. మహిళా రిజర్వేషన్లను అమలుచేయాల్సిన సమయం వచ్చింది. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేవు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలను తీసుకునేందుకు



పార్లమెంట్‌కు రాజ్యాంగం శక్తినిచ్చింది. ఈ క్రమంలోనే మూడు కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టాం. లోక్‌సభ స్థానాలను 50శాతానికి పెంచేందుకు వీటిని తీసుకొచ్చాం. ఈ బిల్లులతో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. లోక్‌సభ స్థానాలు 815కు పెరగడంతో మహిళలకు 272 సీట్లు లభిస్తాయి. దీనివల్ల ఎవరికీ నష్టం ఉండదు. ఈ మహిళల కోటాలో ఎస్సీ, ఎస్టీలకు ఉపకోటా కూడా లభిస్తుంది" అని కేంద్ర మంత్రి వివరించారు.

*** డీలిమిటేషన్‌తో**

**రిజర్వేషన్లకు ముడిపెట్టొద్దు: గౌరవ్ గొగోయ్**

అనంతరం ఈ బిల్లులను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడారు. "మహిళల రిజర్వేషన్లకు సంబంధించి మూడేళ్ల క్రితం ఇవే చర్చలు జరిగాయి. వాటినే కేంద్రం మళ్లీ చెబుతోంది. 2023 కంటే ముందు ఐదుసార్లు మహిళలకు సంబంధించిన చట్టాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ మహిళల రిజర్వేషన్లకు అనుకూలంగా ఉంది. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిన నాటినుంచే వాటిని అమలుచేయాలి. మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ స్థానాల పెంపునకు ముడిపెట్టవద్దు. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేస్తామని గతంలో హోం మంత్రి చెప్పారు. మహిళా రిజర్వేషన్లను మరింత ఆలస్యం చేయాలని కేంద్రం చూస్తోంది" అని కాంగ్రెస్ ఎంపీ విమర్శించారు.

## రాజ్యాంగ సవరణ అంత ఈజీ కాదు.. లెక్కలివీ..!

న్యూఢిల్లీ: చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించడం, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచేందుకు, పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం మూడు బిల్లులు తీసుకొచ్చింది. ఇందులో 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ కీలకం. ఎందుకంటే, ఈ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ సాధించాల్సి ఉంటుంది. అయితే, ఇదంత ఈజీ కాదని రాజకీయ పండితులు చెబుతున్నారు. విపక్షాలు మద్దతు కూడగట్టడమో.. ఓటింగ్ సమయంలో పెద్ద సంఖ్యలో విపక్ష ఎంపీలు దూరంగా ఉండడమో జరిగితే తప్ప ఈ బిల్లు ఆమోదం పొందడం అంత సులువు కాదని పేర్కొంటున్నారు.

**బలాబలాలు ఇవీ..**

- * ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 292 మంది ఎంపీలు ఉన్నారు. మొత్తం సంఖ్యలో వీరి బలం 54 శాతం. విపక్ష కూటమికి 233 మంది సభ్యుల బలం ఉంది. వీరు కాకుండా ఏడుగురు స్వతంత్రులు, వైకాపాకు నలుగురు, శిరోమణి అకాలీదళ్, ఏఎస్‌పీ కాన్సీరాం, జెడ్‌పీఎం, యూపీపీఎల్ పార్టీలకు ఒక్కొక్కరు చొప్పున ఎంపీలు ఉన్నారు. ఎంఐఎం ఇప్పటికే ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించింది.
- * నిబంధనల ప్రకారం సభలో పాల్గొనే సభ్యుల్లో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించాలంటే 360 మంది ఎంపీల మద్దతు అవసరం.
- * ఒకవేళ 30 మంది విపక్ష ఎంపీలు ఓటింగ్‌కు



దూరంగా ఉంటే సభ్యుల సంఖ్య 510కు తగ్గుతుంది. అప్పుడు మద్దతు అవసరమైన ఎంపీల సంఖ్య 340కి చేరుతుంది.

- * ఒకవేళ 60 మంది గైర్హాజరైతే మొత్తం సభ్యుల సంఖ్య 480కి చేరుతుంది. అప్పుడు 320 మంది ఎంపీల మద్దతు అవసరం పడుతుంది.
- * ఒకవేళ 90 మంది ఎంపీలు సభకు దూరంగా ఉంటే అప్పుడు మూడింట రెండొంతుల మెజారిటీకి అవసరమైన ఎంపీల సంఖ్య 300కు తగ్గుతుంది.
- * ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు 98 మంది ఎంపీలు ఉన్నారు. వీరు కాకుండా కూటమిలో ఇతర పక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ (37), తృణమూల్ కాంగ్రెస్ (28), డీఎంకే (22)లో ఏదైనా రెండు పార్టీలు ఓటింగ్‌కు దూరమైతే లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.
- * మరోవైపు, లోక్‌సభలో ఎన్డీయే కూటమి నుంచి భాజపాకు సొంతంగా 240 మంది ఎంపీలు ఉండగా.. తెదేపాకు 16 మంది; జేడీయూకి 12 మంది ఎంపీలు ఉన్నారు.

ఒకవేళ లోక్‌సభలో ఈ బిల్లులు ఆమోదం పొందకపోతే.. వీటిని రాజ్యసభలో ప్రవేశపెట్టరు.

**రాజ్యసభలోనూ అదే పరిస్థితి**

లోక్‌సభలో ఆమోదం పొందితే గానీ బిల్లు రాజ్యసభకు చేరే అవకాశం లేదు. ప్రస్తుతం రాజ్యసభలో ఎన్డీయేకు 141 మంది సభ్యుల బలం ఉంది. ప్రతిపక్షానికి 83 మంది ఎంపీల మద్దతు ఉంది. వీరు కాకుండా బీఆర్ఎస్, వైకాపా, బీజేడీ, బీఎస్పీ, స్వతంత్రులు కలిపి 20 మంది ఎంపీలు ఉన్నారు. వీరు నిర్ణయాత్మకంగా మారనున్నారు. రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ కావాలంటే 163 మంది ఎంపీల మద్దతు అవసరం. భాజపాకు 107, కాంగ్రెస్‌కు 28, తృణమూల్‌కు 13, ఆప్‌కు 10, డీఎంకేకు 8 మంది సభ్యులు ఉన్నారు. డీలిమిటేషన్ బిల్లుతో రాష్ట్ర రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకు ముప్పు ఏర్పడుతుందని, వాటి పరిరక్షణ కోసం ఒడిశాకు చెందిన ఎంపీలంతా కలిసికట్టుగా పోరాడాలని బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు తెలిపినప్పటికీ 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఒరిజినల్ రూపాన్ని వ్యతిరేకించాలన్నారు. ఈ బిల్లు తన నిర్దేశిత లక్ష్యానికి మించిన తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు, కొందరు భాజపా ఎంపీలు సైతం ఈ కీలక బిల్లులు ఆమోదానికి అవసరమైన సంఖ్యా బలం తమకు లేదని బయట ప్రస్తావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందితే క్రెడిట్ మొత్తం విపక్షాలే తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించడం గమనార్హం. ఈ బిల్లులపై శుక్రవారం ఓటింగ్ నిర్వహించనున్నారు.

## మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు: లోక్‌సభలో మోదీ

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు . చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు ఉద్దేశించిన 3 కీలక బిల్లులను కేంద్రం నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. వీటిపై చర్చలో భాగంగా ప్రధాని మోదీ సభలో ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ల ను వ్యతిరేకించే వారు మూల్యం చెల్లించుకోక తప్పదంటూ విపక్షాలను హెచ్చరించారు.

**గిఫ్ట్ కాదు.. ఇది హక్కు**

"దేశ పార్లమెంట్ చరిత్రలో ఈ రోజును మర్చిపోలేం. మహిళా రిజర్వేషన్ గొప్ప బిల్లు. ఈ చారిత్రక సమయంలో పాలు పంచుకోవడం నా అదృష్టం. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు" అని మోదీ వ్యాఖ్యానించారు.

**ఆ పార్టీలకే మనుగడ..**

"మహిళా రిజర్వేషన్ల కోసం 30 ఏళ్ల పాటు ప్రయత్నాలు జరిగినా గతంలో ఇది సాకారం కాలేదు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లే. ఈ బిల్లును తేవడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరు. బిల్లును వ్యతిరేకించే పార్టీలకు, నేతలకు మహిళలు బుద్ధి చెబుతారు. సమయం చూసి దెబ్బకొడుతారు. మహిళా బిల్లులకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది" అని విపక్షాలకు ప్రధాని చురకలంటించారు.

**దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు..**

"ఈ బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని




ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం" అని మోదీ స్పష్టం చేశారు.

**నాకు క్రెడిట్ వద్దు.. మీరే తీసుకోండి**

"ఈ బిల్లుతో దేశంలోని మహిళలకు వారి హక్కులను కల్పిస్తున్నాం. ఈ బిల్లుపై క్రెడిట్ నాకు అవసరం లేదు. మీరే (విపక్షాలను ఉద్దేశిస్తూ) తీసుకోండి.. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి. ఈ బిల్లును అడ్డుకోకుండా సహకరించి మీ గొప్పతనం చాటుకోండి. మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిద్దాం" అని మోదీ విపక్షాలను కోరారు.

## సంక్షోభం కొనసాగితే విమానాలు రద్దే!.. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ

పారిస్/వాషింగ్టన్: ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్‌లు చేస్తున్న యుద్ధం కారణంగా అనేక దేశాలు ఇంధన కొరత ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అంతర్జాతీయ ఇంధన సంస్థ (IEA) కీలక వ్యాఖ్యలు చేసింది. ఐరోపా వద్ద జెట్ ఫ్యుయల్ మరో ఆరు వారాలకు సరిపడా మాత్రమే ఉందని తెలిపింది. చమురు సంక్షోభం ఇలాగే కొనసాగితే.. విమాన సర్వీసులు రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించింది. హర్మూజ్ జలసంధి మార్గంలో



ఇంధనం, గ్యాస్‌తోపాటు కీలక సరఫరా వ్యవస్థలకు ఆటంకం ఏర్పడటం వల్ల ఎన్నడూ చూడని ఇంధన సంక్షోభం ఏర్పడిందని ఐఈఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాతిహ్ బిరోల్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపాయన్నారు. ఈ సంక్షోభం ఎంతకాలం కొనసాగితే, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణానికి అంత ఎక్కువ నష్టం వాటిల్లుతుందన్నారు. దీని ప్రభావం వల్ల పెట్రోల్, గ్యాస్, విద్యుత్ ధరలు పెరుగుతాయన్నారు.



## మొలకెత్తిన బంగాళదుంపలు తింటున్నారా? అయితే జాగ్రత్త..!

ఆలుగడ్డ (బంగాళదుంపను) మొలకెత్తిన తర్వాత దాన్ని కోసేసి చాలా మంది వండుకుని తింటుంటారు. ఏం కాదులే ఏం అవుతుందని అనుకుంటారు.

కానీ మొలకెత్తిన బంగాళాదుంపలను తినడం వల్ల కండ్లు వాపులు వచ్చే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

బంగాళాదుంప మొలకెత్తిన తర్వాత, దాని పోషక విలువ తగ్గుతాయి.

బంగాళాదుంపలో కార్బోహైడ్రేట్లు, విటమిన్ సి వల్ల మొలకెత్తుతాయి. మొలకెత్తిన బంగాళాదుంపల్లో గ్లైకోఅల్కలాయిడ్స్ అని పిలువబడే సహజ విష సమ్మేళనాలను కలిగి ఉంటాయి.


మొలకెత్తిన బంగాళదుంపలలో సోలనిన్, చాకోనిన్ అనే రెండు గ్లైకోఅల్కలాయిడ్స్ ఉంటాయి.

వీటి వల్ల కడుపు నొప్పి, తలనొప్పి, వాంతులు, వికారం, విరేచనాలు, కడుపు నొప్పి తదితర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

మొలకెత్తిన బంగాళాదుంపలను తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

మధుమేహ వ్యాధిగ్రస్తులు మొలకెత్తిన బంగాళదుంపలను తినకూడదు.

ఒకవేళ తిన్నట్లైతే చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది





## గీజర్ వాడుతున్నారా అయితే ఈ జాగ్రత్తలు తీసుకోండి

చాలా మందికి వేడి నీళ్లతో స్నానం చేయడం అలవాటు. దీని కోసం గీజర్ ను వాడుతుంటారు. అయితే గీజర్ వల్ల కొన్ని ప్రమాదాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చు. గీజర్ తో ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ లాంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.

కాబట్టి తగిన కేర్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

వేడి నీటితో స్నానం చేయాలని చాలా మంది గీజర్ ఆన్ చేసి, స్నానం చేశాక ఎక్కువసేపు అలాగే వదిలేస్తుంటారు. ఇలా చేయడం ప్రమాదకరం.

దీంతో గీజర్ చాలా హీట్ ఎక్కుతుంది. ఎలక్ట్రికల్ వైర్లు కూడా వేడెక్కి సమస్యలు తలెత్తవచ్చు. కొన్నిసార్లు గీజర్ పేలిపోవచ్చు.

గీజర్ ను ఆరునెలలు, ఏడాదికోసారి సర్వీస్ చేయించాలి. వైర్లు పాడైపోతే వెంటనే మార్చాలి.

వాల్వ్స్‌లో లీకేజీలు లేకుండా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ట్యాంక్‌లో నీళ్లు లేప్పుడు గీజర్ ఆన్ చేస్తే పాడైపోవచ్చు.

ఇంట్లో గీజర్ ఆన్ చేసి ఉన్నప్పుడు ఎక్కువ పవర్ తీసుకునే ఇతర పరికరాలను వాడకూడదు.

హీటింగ్ ఎలిమెంట్ అరిగిపోయినా దానిపై మినరల్స్ పేరుకుపోయినా వెంటనే మార్చాలని సూచిస్తున్నారు.

ఆటోమేటిక్‌గా ప్రెజర్ రిలీజ్ చేసే సేఫ్టీ వాల్వ్ ఇన్‌స్టాల్ చేయించడం ఉత్తమం.

విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు సంభవిస్తుంటే గీజర్ ఆఫ్ చేయడం మంచిది.

తుప్పు పట్టినట్లు గమనిస్తే ఆ గీజర్‌ను వాడకపోవడమే బెటర్. నీళ్లు వేడి కాగానే ఆటోమేటిగ్గా ఆఫ్ అయ్యే టైమర్ ఫీచర్ ఉన్న గీజర్‌ను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వీకెండ్స్ లో వ్యాయామం.. ఎటువంటి రిజల్ట్స్ ఉంటాయి?

ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో చాలా మంది వ్యాయామం చేయడమే మరిచిపోతున్నారు. ఎక్కడ తీరిక ఉంటుంది. ఎలా చేయాలి వ్యాయామం అంటూ తమకు తామే సర్దిచెప్పుకుంటున్నారు.

కానీ కొంతమంది మాత్రం ఏ పని ఉన్నా శని, ఆది వారాలు చేస్తున్నారు.

అలాంటి వారు వ్యాయామం కూడా వీకెండ్స్ లో చేస్తే మంచి ప్రయోజనాలు ఉంటాయని సెంటర్స్ ఫర్ డిసీస్ కంట్రోల్ (సీడీసీ) సూచనలు చేస్తోంది.

వారంలో రోజుకు 30 నిమిషాలు నడవడం మంచిదని చెబుతున్నారు.


కాగా వీలు కానివారు వారంలో వీకెండ్స్ లలో 150 నిమిషాలు నడిచినా పర్లేదని శరీరానికి కావాల్సిన శక్తి చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఈ వారాంతపు వ్యాయామం కూడా మంచి ఫలితాలే ఇస్తున్నదని ఇటీవలి ఓ అధ్యయనం వెల్లడించింది.

ఇలా చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని సెంటర్స్ ఫర్ డిసీస్ కంట్రోల్ (సీడీసీ) సూచనలు చెబుతున్నాయి.

నిత్యం వ్యాయామం చేసేవారితో పోలిస్తే.. వారాంతాల్లో వ్యాయామం చేసేవారు దాదాపు 264 వ్యాధుల బారినుంచి తప్పించుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం, ఊబకాయం లాంటి వ్యాధులు కూడా దూరమవుతాయని అంటున్నారు













## ‘బిందీ-తిలకం’ అది పాత సర్క్యులర్..
# స్పందించిన సీఈఓ

తన సిబ్బంది మతపరమైన గుర్తులు ధరించవద్దని ప్రముఖ కళ్లజోళ్ల విక్రయ సంస్థ లెన్స్‌కార్ట్ ఆదేశించిందంటూ ఒక సర్క్యులర్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. అది తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వివాదంపై సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ పీయూశ్ బన్సల్ స్పష్టత ఇచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? లెన్స్‌కార్ట్ సిబ్బంది స్టైల్ గైడ్ అంటూ నెట్టింట్లో కొన్ని పాయింట్లు వైరల్ అయ్యాయి. వాటి ప్రకారం.. తన స్టోర్లలో సిబ్బంది నలుపు రంగు హెడ్‌స్కార్ఫ్, నలుపు తలపాగాలు ధరించడానికి అనుమతి ఉంది. తిలకం, బిందీ పెట్టుకోవడానికి మాత్రం అనుమతి లేదు. ఈ పాయింట్లు నెట్టింట్లో చక్కర్లు కొట్టడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. మతపరమైన పక్షపాతం చూపిస్తున్నారంటూ కొందరు నెటిజన్లు పోస్టులు పెట్టారు. ఈ వ్యవహారంపై బన్సల్ ఎక్స్ వేదికగా స్పష్టత ఇచ్చారు. ‘‘లెన్స్‌కార్ట్‌కు సంబంధించి




ఒక అసత్యప్రచారం జరుగుతోంది. బిందీ, తిలకం సహా ఎలాంటి మతపరమైన వ్యక్తీకరణలపైన కూడా మా సంస్థలో ఆంక్షలు లేవు. మేం ఎప్పటికప్పుడు మా మార్గదర్శకాలను సమీక్షిస్తూనే ఉంటాం. పాత విధానాలు ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబించవు. ఈ గందరగోళం పట్ల క్షమాపణలు కోరుతున్నాం’’ అని ఒక ప్రకటన విడుదల చేశారు.

# 19%ప్రీమియంతో విప్రో రూ.15 వేల కోట్ల బైబ్యాక్

ఢిల్లీ: ప్రముఖ ఐటీ సేవల సంస్థ విప్రో షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. రూ.15 వేల కోట్లతో షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. ఒక్కో షేరును రూ.250 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. గురువారం నాటి స్టాక్ క్లోజింగ్ ధరతో (రూ.210) పోలిస్తే ఇది 19 శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం 60 కోట్ల షేర్లను కొనుగోలు చేయనున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. కంపెనీ పెయిడ్ అప్ షేర్ క్యాపిటల్‌లో 5.7 శాతానికి ఇది సమానమని, రూ.15 వేల కోట్లు మించకుండా బైబ్యాక్ చేపట్టనున్నట్లు కంపెనీ వెల్లడించింది. టెండర్ రూట్‌లో ఈ బైబ్యాక్ చేపట్టనున్నట్లు విప్రో తెలిపింది. రికార్డు తేదీ నాటికి విప్రో షేర్లు కలిగిన వాటాదారులు ఈ బైబ్యాక్‌లో పాల్గొనేందుకు అనుమతిస్తామని పేర్కొంది. ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూపు సభ్యులు ప్రతిపాదిత బైబ్యాక్‌లో పాల్గొనేందుకు సంకేతాలు ఇచ్చారని తెలిపింది. రికార్డు తేదీ వివరాలను త్వరలో వెల్లడిస్తామంది. 2019లో రూ.10,500 కోట్లు, 2020 నవంబరులో రూ.9,500 కోట్లు, 2023లో రూ.12వేల కోట్లతో విప్రో బైబ్యాక్ చేపట్టింది. తాజా బై బ్యాక్ విప్రో చరిత్రలో భారీ బైబ్యాక్‌గా నిలవనుంది.




**క్షీణించిన విప్రో లాభం**

మరోవైపు విప్రో తన త్రైమాసిక ఫలితాలను కూడా గురువారం ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం 2 శాతం క్షీణించి రూ.3502 కోట్లకు పరిమితమైంది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలపాల ద్వారా వచ్చే ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.24,236 కోట్లుగా నమోదైంది. అంతకుముందు త్రైమాసికంతో పోల్చినప్పుడు విప్రో లాభంలో 12 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం.

## ట్రేడ్ డీల్‌కు ముందు..
# అమెరికా వాణిజ్య ప్రతినిధితో భారత రాయబారి భేటీ

వాషింగ్టన్: భారత్‌అమెరికా మధ్య మరోసారి వాణిజ్య చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో.. అగ్రరాజ్యానికి భారత రాయబారి అయిన వినయ్ మోహన్ క్వాత్రా తాజాగా భేటీ అయ్యారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన అంశాలపై వీరివురూ చర్చలు జరిపారు. ఈ విషయాన్ని క్వాత్రా ఎక్స్ వేదికగా వెల్లడించారు. ‘‘ద్వైపాక్షిక సహకారంపై ఇరుదేశాలకు ఉన్న అవకాశాలపై మేం చర్చించాం. దీంతోపాటు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న కీలక పరిణామాల పైనా మాట్లాడుకున్నాం’’ అని భారత రాయబారి వెల్లడించారు. ఈ భేటీలో అమెరికా మాజీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ రాబర్ట్ ఓబ్రెయిన్ కూడా పాల్గొన్నారు. ట్రేడ్




డీల్ (Trade Deal) కోసం భారత బృందం వచ్చేవారం వాషింగ్టన్‌కు వెళ్లనున్న వేళ వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక, గత నెలలో భారత్‌పై సెక్షన్ 301 కింద అమెరికా ప్రారంభించిన దర్యాప్తును విరమించుకునే అంశం పైనా వీరు చర్చించినట్లు సమాచారం. భారత్‌అమెరికా ఫిబ్రవరిలో విడుదల చేసిన సంయుక్త ప్రకటన ప్రకారం, భారత్‌పై టారిఫ్‌ను 18 శాతానికి తగ్గించడానికి అంగీకారం కుదిరింది. అయితే ట్రంప్ విధించిన ఈ ప్రతీకార టారిఫ్‌లు చెల్లవంటూ ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతో టారిఫ్ పరంగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులపై చర్చలు జరిపి, తదుపరి కార్యాచరణను చేపట్టేందుకు భారత్, అమెరికా ముఖ్య సంధానకర్తలు ఏప్రిల్ 20 నుంచి మూడు రోజుల పాటు వాషింగ్టన్‌లో చర్చలు జరపనున్నారు. ఇదిలాఉండగా.. భారత్‌పై ప్రకటించిన సెక్షన్ 301 దర్యాప్తును విరమించుకోవాలని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్‌కు కేంద్రం ఇప్పటికే విజ్ఞప్తి చేసింది. అమెరికా తయారీ రంగంపై తీవ్ర ప్రభావం చూపే ‘సహేతుకం కాని విదేశీ ధోరణుల’ను అవలంబిస్తున్నాయా? అనే కోణంలో భారత్ సహా 15 దేశాలపై అగ్రరాజ్యం ఈ దర్యాప్తు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో ఆయా దేశాలు అసమంజస వాణిజ్య విధానాలను అనుసరిస్తున్నాయని తేలితే వాటిపై టారిఫ్‌లు, జరిమానాలు విధించనున్నట్లు అమెరికా గతంలో వెల్లడించింది.

## ధరలు పెంచిన HUL..
# లిరిల్, డవ్, పియర్స్ సబ్బులు ప్రియం

ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (HUL) సబ్బుల ధరలను పెంచేసింది. ముడి సరకు ధరలు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడంతో ధరల పెంపు చేపట్టినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా లిరిల్, పియర్స్, డవ్ వంటి సబ్బుల ధరలు 100 గ్రాములకు రూ.23 చొప్పున పెరిగాయి. అంటే సుమారు 35 శాతం పెరుగుదల కనిపించింది. తాజా ధరల సవరణతో లిరిల్ 100 గ్రాముల బార్ రూ.41కు చేరింది. పియర్స్ రూ.42, డవ్ సీరమ్ సోప్ రూ.60, డవ్ పింక్ సోప్ రూ.70కి పెంచింది. సబ్బులతో పాటు సర్ఫ్, రెడ్ లేబుల్ వంటి ఇతర ఉత్పత్తులూ ఈ జాబితాలో ఉన్నాయి. గతేడాది జీఎస్టీ రేట్ల సవరణతో ఉత్పత్తుల ధరలు తగ్గించిన హెచ్‌యూఎల్.. ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరలను పెంచేసింది. ముఖ్యంగా సబ్బుల తయారీలో కీలక ముడి పదార్థమైన పామ్ ఫ్యాటీ యాసిడ్ డిస్టిలేట్ (PFAD) ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో హెచ్‌యూఎల్ ఈ నిర్ణయం తీసుకుంది. సరఫరా కొరత, పామాయిల్ ధరల్లో ఒడుదొడుకుల కారణంగా ఇటీవల కాలంలో పీఎఫ్‌ఏడీ ధరలు విపరీతంగా పెరిగాయి. అదే సమయంలో పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు రసాయన ముడి పదార్థాల ధరలు పెరిగాయి.

## బీసీసీఐకి కొత్త తలనొప్పి..
# వైభవ్ సూర్యవంశీకి స్థానం ఎక్కడ?

ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత.. టీమ్‌ఇండియా తొలి పర్యటనగా ఐర్లాండ్‌కు వెళ్లనుంది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు కల్పించడం దాదాపు ఖాయమేనని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఇక్కడే మేనేజ్‌మెంట్‌కు ఓ కఠిన సవాల్ ఎదురుకానుంది. అదే వైభవ్‌ను ఎక్కడ ఆడించాలి? ఎవరిని పక్కన పెట్టాలి? అని తలనొప్పిగా మారే అవకాశం లేకపోలేదు. టీ20 సిరీస్ కోసం ఐర్లాండ్‌కు పంపించే ఆటగాళ్ల షార్ట్ లిస్ట్‌లో వైభవ్ సూర్యవంశీకి బీసీసీఐ చోటు కల్పించిందని వార్తలు వచ్చాయి. అయితే, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను ఎంపిక చేసే అవకాశం లేదు. ఇప్పటికే బీసీసీఐ లాజిస్టిక్స్ విభాగం నుంచి సమాచారం వచ్చింది. ఐరిష్ వీసాలు ఎవరెవరికి అవసరమనే జాబితాను పంపించాలని సెలక్షన్ కమిటీని అడిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జట్టులో నలుగురు టాప్ ఓపెనర్లు ఉన్నారు. అభిషేక్ శర్మ, సంజు శాంసన్, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్ రూపంలో దూకుడుగా ఆడే క్రికెటర్లు





ఉన్నారు. ఇప్పుడు వైభవ్‌ను తీసుకొస్తే.. వీరిలో ఎవరిని తప్పిస్తారనేది ఆసక్తికరంగా మారింది. అభిషేక్ ఎలాగూ ఓ వైపు తన ప్లేస్‌ను ఫిక్స్ చేసేసుకున్నాడు. ఇక రెండో ఓపెనర్‌గా వైభవ్ వస్తే మేనేజ్‌మెంట్‌కు కఠిన సవాల్ తప్పదు. ఐర్లాండ్‌తో సిరీస్ కాబట్టి.. ఇప్పటికైతే సంజు, ఇషాన్‌ను పక్కనపెట్టినా పెద్ద ఇబ్బంది ఉండదు. వీరిద్దరూ వన్‌డౌన్‌లోనూ ఆడగల సమర్థులే. మరోవైపు టీ20 ప్రపంచ కప్‌ను గెలిపించిన సారథి సూర్యకుమార్ బ్యాటర్‌గా విఫలమై నిరాశపరిచాడు. అతడికీ చోటు దక్కడం కష్టమేనని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

**అభిషేక్ లేదా సంజుకు కెప్టెన్సీ?**

ఇప్పుడు సెలక్షన్ కమిటీ ముందు మరో సమస్య వేధిస్తోంది. ఒకవేళ సూర్యకుమార్ యాదవ్‌ను పక్కనపెడితే.. ఐర్లాండ్‌తో టీమ్‌ఇండియాను నడిపించే బాధ్యత అభిషేక్ శర్మ లేదా సంజు శాంసన్‌కు దక్కే అవకాశం లేకపోలేదు. ఒకవేళ వైభవ్‌కు స్థానం కల్పించేందుకు వీరిద్దరినీ పక్కనపెడితే.. అందుకు తగిన కారణం చెప్పాల్సిన బాధ్యత బీసీసీఐపై ఉంది. సూర్యను జట్టులో ఉంచి.. బాగా ఆడే సంజు, అభిషేక్‌ను ఎలా పక్కన పెడతారనే ప్రశ్నలు తలెత్తుతాయి. సూర్యకు అవకాశం ఇవ్వకుండా అభిషేక్ లేదా సంజులో ఒకరికి నాయకత్వం అప్పగిస్తే పెద్ద సమస్యేమీ ఉండదని క్రికెట్ వర్గాలు విశ్లేషించాయి.

## ఇక్కడి ఆతిథ్యం అద్భుతం..
# నా పంజాబీ మాటలు వారికి చాలా ఇష్టం: సికందర్ రజా

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో తనకు ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయని జింబాబ్వే స్టార్ ఆల్‌రౌండర్ సికందర్ రజా గుర్తుచేసుకున్నాడు. ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్ ఆడుతోన్న రజా ఓ ఇంటర్వ్యూలో ఐపీఎల్ నాటి ముచ్చట్లను వెల్లడించాడు. 2023, 2024 సీజన్లలో పంజాబ్ కింగ్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు. ఇక గత మినీ వేలంలోనూ తన పేరును రిజిస్టర్ చేసుకోలేదు. అయితే, ఐపీఎల్‌లో ఆడే అవకాశం వస్తే వదులుకోనని చెప్పాడు. ‘‘ఐపీఎల్ ఆడే సమయంలో నాకు దక్కిన ఆతిథ్యం అద్భుతం. మరీ ముఖ్యంగా నా సహచరులు చాలా స్నేహంగా ఉండేవారు. ఎక్కడికి వెళ్లినా మేమంతా కలిసి ప్రయాణించేవాళ్లం. అందులో నాకు జస్సీ మంచి స్నేహితుడు. అతడి ఇంటికి కూడా వెళ్లా. నా గురించి ఏమి ఆలోచిస్తాడు.. నన్ను ఎలా చూస్తాడని ఎప్పుడూ అనుకోలేదు. చాలా త్వరగా ప్రాణమిత్రులమయ్యాం. ఇప్పటికీ అతడి గ్రాండ్ మదర్ నాకు మెసేజ్ చేస్తుంటారు. ఎప్పుడు వీలైతే అప్పుడు ఇక్కడికి రావాలి బేటా అంటూ ఆప్యాయత చూపించారు. అర్ష్‌దీప్ సింగ్ ఇంటికీ వెళ్లా. అతడి కుటుంబసభ్యులూ సాదరంగా ఆహ్వానించారు. నా పంజాబీ భాష అంటే వారికి చాలా ఇష్టం. నాకు ఇప్పటికీ గుర్తుంది.. అర్ష్‌దీప్ వాళ్ల తల్లి అనుకుంటా ‘బాబు.. నువ్వు ఇలాగే పంజాబీ మాట్లాడుతూ ఉండు. నీ నోటి నుంచి ఆ మాటలు వింటుంటే బాగుంది’ అని అన్నారు. వారితో కలిసి భోజనం, అల్పాహారం చేశా. టీ తాగా.




మళ్లీ అవకాశం వస్తే తప్పకుండా వెళ్తా’’ అని రజా తెలిపాడు. జింబాబ్వేకు సారథిగా వ్యవహరించిన సికందర్ రజా 1986లో పాకిస్థాన్‌కు చెందిన పంజాబ్‌లోని సియోల్‌కోట్‌లో జన్మించాడు.




## నేను 100%కోలుకోలేదు..
# అందుకే అలా వచ్చా: విరాట్ కోహ్లీ

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అనూహ్యంగా విరాట్ కోహ్లీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చాడు. గత మ్యాచ్ సమయంలోనే మోకాలు నొప్పి ఉన్నా.. ఎలాగోలా ఆడేశాడు. లఖ్‌నవూతో పోరుకు ముందు కూడా కాలుకు పట్టీ వేసుకొని ఉండటంతో ఓ దశలో ఆడతాడా? లేదా? అనే అనుమానాలు వచ్చాయి. అయితే, ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చేశాడు. 49 పరుగులు చేసి ఆర్సీబీ విజయంలో కీలకపాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం తన ఫిట్‌నెస్‌పై కోహ్లీ స్పందించాడు. ‘‘గత మ్యాచ్ కంటే ఇప్పుడు బాగానే ఉంది. అయితే, ఇప్పటికీ వందశాతం కోలుకోలేదు. ముంబయితో పోరు సమయంలో నా మోకాలులో నొప్పి వచ్చింది. ఆరోగ్యపరంగానూ ఇబ్బందిపడ్డా. ఇప్పుడు ఈ మ్యాచ్‌లో మెరుగైన ఆటతీరు ప్రదర్శించానని అనుకుంటున్నా. మంచి ఆరంభం దక్కింది. పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సాగాలి. పిచ్ ఒక్కసారిగా నెమ్మదించడంతో ఒక దశలో పరుగులు చేయడం కష్టంగా మారింది. అప్పుడు ఆటలో మార్పులు చేసుకోవాలి. గత మూడు రోజులుగా ఇక్కడ చాలా వేడిగా ఉంది. తప్పకుండా పిచ్ మందకొడిగా మారుతుందని ముందే ఊహించాం. పవర్ ప్లేలోనే మ్యాచ్‌లో ఆధిపత్యం ప్రదర్శించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌ను లాగేసుకొనేందుకు అవకాశం ఉంది. అందుకే దూకుడుగా ఆడాలని నిర్ణయించుకున్నాం. అదేవిధంగా సాగింది. మా



బ్యాటింగ్ లైనప్ చాలా బాగుంది. ఇప్పటివరకు కృనాల్ పాండ్య బ్యాటింగ్ చేయలేదంటే అర్థం చేసుకోవచ్చు. టిమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్ స్వేచ్ఛగా ఆడేస్తారు. కేవలం నాలుగు ఓవర్లలో 50 పరుగులు రాబట్టేస్తారు. అంత సత్తా ఉంది. ఇప్పుడు మనం ఇంకా తొలిదశలోనే ఉన్నాం. ముమ్ముందూ పోటీ మరింత తీవ్రంగా ఉండబోతోంది. పరిస్థితులను త్వరగా అలవర్చుకొని ఆడేయాలి. టీ20ల్లో భారీ మార్పులు వస్తుంటాయి. నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నా. గత రెండు మ్యాచులతో బెస్ట్ ఇవ్వలేదని అనుకుంటా. ఆటను అత్యుత్తమ ప్రమాణాలతో ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని చూస్తుంటా’’ అని విరాట్ తెలిపాడు.

# సినిమా

## అది దీపిక సంపాదించుకున్న స్థాయి...

## ఆమెకు ఆ హక్కు ఉంది : కంగన





ఇండస్ట్రీలో వర్కింగ్ అవర్స్‌పై అనేక మంది నటీనటులు తమ స్పందన తెలియజేసిన సంగతి తెలిసిందే. ఈ చర్చ ఇంకా కొనసాగుతూనే ఉంది. పని గంటల విషయంలో అభిప్రాయ భేదాలు రావడంతో అగ్ర కథానాయిక దీపిక పదుకొణె భారీ ప్రాజెక్ట్‌లు సైతం వదులుకున్నారు. తాజాగా ఈ విషయమై నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ స్పందించారు. దీపికకు మద్దతుగా నిలబడ్డారు. 8 గంటలు మాత్రమే పనిచేస్తానని దీపిక చెప్పడం సబబేన్నారు. ఎంతో కష్టపడి ఆమె ఈ స్థాయికి వచ్చారని, నటించే విషయంలో తనకంటూ నిర్ణయం తీసుకునే హక్కు ఉందన్నారు. పైగా ఇప్పుడామె ఓ బిడ్డకు తల్లి కూడా అని ఎంపీ కంగనా రనౌత్ అన్నారు. ''వర్కింగ్ అవర్స్ విషయంలో వివాదం సృష్టించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే బాలీవుడ్‌లో ప్రస్తుతం దీపిక పదుకొణె స్థానం ఆమె ఎంతో కష్టపడి సంపాదించుకున్నది. పైగా ఇప్పుడామె ఓ బిడ్డకు తల్లి. అగ్ర కథానాయిక. ఒకవేళ ఆమె 8 గంటలు మాత్రమే పని చేస్తానని అంటే కచ్చితంగా ఆ నిర్ణయం తీసుకునే హక్కు తనకి ఉంది. గతంలో నేను దీపికను కలిసినప్పుడు తాను ఇంతియాజ్ అలీ సినిమా కోసం 12 గంటల పాటు పనిచేస్తున్నట్లు చెప్పింది. అప్పుడు నేను కేవలం 10 గంటలు మాత్రమే పనిచేస్తానని చెప్పా. అప్పట్లో మేము సినిమా కోసం ఎన్ని గంటలైనా పనిచేసేవాళ్లం. చాలా ఉత్సుకతతో ఉండేవాళ్లం. ఏదైనా చేయడానికి రెడీ అనే వాళ్లం. అందుకే మేము సక్సెస్ అయ్యాం''. ''కొత్తగా ఇండస్ట్రీకి వచ్చిన సమయంలో ఎవరికైనా వారి స్థానం, పాత్ర మారిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడు దీపిక స్థానం ప్రత్యేకం. పైగా ఆమె ఓ బిడ్డకు తల్లి. కుటుంబం తర్వాతే ఏమైనా. ఎంతో కష్టపడి ఆమె ఈ స్థాయికి చేరుకుంది. ఎవరైనా కచ్చితంగా తనతో పనిచేయాలనుకుంటే ఆ 8 గంటలు పనిచేయడానికి ఇష్టపడే పిలుస్తారు. అలా ఎందుకు చేయకూడదు. ప్రస్తుతం ఎక్కువమంది సంతాన సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. వివాహ బంధాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు ఏం చేస్తారు? మాపై ఒత్తిడి పెరుగుతూ వస్తోంది. ఇటు కుటుంబం అటు పిల్లలతో పని రెట్టింపు అవుతోంది. ఇప్పుడు పేర్లు చెప్పాల్సిన పనిలేదు.



## తమన్నా పిటిషన్.. కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు

'పవర్ సోప్స్' కంపెనీపై నటి తమన్నా దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తన ఆరోపణలకు సంబంధించి నటి తగిన సాక్ష్యాలు చూపలేక పోవడంతో పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. బ్రాండ్ ప్రమోషన్స్‌కు సంబంధించి తమన్నా, పవర్ సోప్స్ కంపెనీ మధ్య 2008లో ఒప్పందం కుదిరింది. 2009 అక్టోబరు వరకూ తమన్నా ఫొటోలతో పవర్ సోప్స్ ప్రచారం చేసుకోవడం అగ్రిమెంట్. అయితే ఒప్పందం గడువు ముగిసినప్పటికీ 2010- 2011 మధ్య సదరు సంస్థ తన ఇమేజ్‌లను అనధికారికంగా వినియోగించుకుందని తమన్నా ఆరోపించారు. ఇందుకుగానూ సంస్థ నుంచి రూ.కోటి నష్టపరిహారం డిమాండ్ చేస్తూ.. ఆ కంపెనీ తన ఫొటోలు వాడకుండా చేయాలంటూ తమన్నా ఇటీవల కోర్టును ఆశ్రయించారు. ఏకసభ్య ధర్మాసనం తీర్పును సవాలు చేస్తూ మరో పిటిషన్ వేశారు. సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది.

## నాన్న నాలుగు గంటలే నిద్రపోయిన రోజులు కూడా చూశా

: రామ్‌చరణ్



నాన్న చిరంజీవి ఎంతో మందిపై ప్రభావం చూపారని, రోజూ ఆయనను చూస్తూ పెరగడం వల్ల తనపై ఆయన ప్రభావం ఎక్కువగా ఉందని తనయుడు, సినీ నటుడు రామ్‌చరణ్ అన్నారు. ప్రముఖ మ్యాగజైన్ 'ఎస్క్వైర్ ఇండియా' కవర్ పేజీపై చరణ్ మెరిసిన విషయం తెలిసిందే. ఈ కవర్ స్టోరీ కోసం ఆయన కొన్ని ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. తన జీవితంలో రియల్ హీరో తండ్రి చిరంజీవి అని ఈ సందర్భంగా చెప్పారు. ''కుటుంబం, సినీ ఇండస్ట్రీలో ఎవరైనా కష్టంలో ఉన్నారని తెలిస్తే, ముందు స్పందించే వ్యక్తి చిరంజీవి. చాలా సందర్భాల్లో నేను ఇది గమనించా. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ముందుకు వెళ్లేవారు. ఇది అసలైన వారసత్వం. ఇది కుటుంబం పట్ల బాధ్యత, పని పట్ల క్రమశిక్షణ'' ''నాన్న వారసత్వాన్ని మేము సులభంగానే తీసుకున్నాం. విజయాలు, స్టార్‌డమ్ ఎన్ని ఉన్నా కూడా ఇంటి దగ్గర సగటు తండ్రిగా ఉండేవారు. అది చాలాప్రత్యేకం.


## ధనుష్‌తో సారా అర్జున్?





త్వరలో 'కర' సినిమాతో తెరపైకి రావడానికి సన్నద్ధమవుతున్నారు ధనుష్. పలు భాషలలో వరుస సినిమాలతో బిజీగా గడుపుతున్న ఈయన ఖాతాలో దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు తెరకెక్కిస్తున్న ఓ సినిమా ఉన్న సంగతి తెలిసిందే. 'డీ 56' (వర్కింగ్ టైటిల్)గా పట్టాలెక్కబోతున్న ఈ చిత్రంలో ధనుష్‌తో అందాల తార రుక్మిణీ వసంత్ జోడీ కట్టనున్నట్లు కొన్నిరోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇప్పుడామె స్థానంలో బాలీవుడ్ యువ కథానాయిక సారా అర్జున్‌ను తీసుకున్నట్లు సమాచారం. ''పలు ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల రుక్మిణి ఈ చిత్రాన్ని అంగీకరించలేకపోయింది. ఇప్పుడా పాత్ర కోసం 'ధురంధర్'తో మంచి క్రేజ్ సంపాదించుకున్న సారాను ఎంపిక చేసే పనిలో పడింది చిత్రబృందం. ఒకవేళ అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. ఆమె మొదటి తమిళ చిత్రమిదే కానుంద''ని తమిళ సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరి రుక్మిణి, సారా.. ఈ ఇద్దరిలో ధనుష్ సరసన నటించేదెవరు? అనే విషయంపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

## 'జన నాయగన్' లీక్ కేసు.. ప్రధాన నిందితుల అరెస్టు



'జన నాయగన్' లీక్ కేసు లో ముగ్గురు ప్రధాన నిందితులను చెన్నై సైబర్ క్రైమ్ విభాగం అరెస్టు చేసింది. వేరే సినిమాకి ఫ్రీలాన్స్ అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేసిన వ్యక్తే ఈ లీక్‌కు కారకుడని పోలీసులు గుర్తించారు. ''ఫ్రీలాన్స్ అసిస్టెంట్ ఎడిటర్ అనధికారికంగా 'జన నాయగన్' మూవీ ఎడిటింగ్ జరిగే స్టూడియోలోకి వెళ్లి, కొంత డేటాను చోరీ చేశాడు. దానిని సినిమాగా మార్చి, ఇతర నిందితులతో పంచుకున్నాడు. అలా ఆన్‌లైన్‌లో ఈ మూవీ సీన్స్ దర్శనమిచ్చాయి. ముగ్గురు నిందితులను కోర్టులో ప్రవేశ పెట్టగా.. రిమాండ్ విధించింది'' అని చెన్నై సైబర్ క్రైమ్ విభాగం ప్రకటనలో పేర్కొంది. పైరసీని ప్రోత్సహించొద్దని చెన్నై సైబర్ క్రైమ్ విభాగం విజ్ఞప్తి చేసింది. ఇలాంటి అనధికారిక వీడియోలను ఎవరితోనైనా పంచుకున్నా చర్యలు తప్పవని హెచ్చరించింది. 'జన నాయగన్' లీక్ కేసులో ఇంతకుముందు ఆరుగురు అరెస్టు అయ్యారు. సెన్సార్ సర్టిఫికెట్ పొందడంలో జాప్యం నెలకొనడంతో ఈ సినిమా వాయిదా పడుతూ వస్తోంది. ఇదిలా ఉంటే మూవీలోని కొన్ని సీన్స్ ఆన్‌లైన్‌లో లీక్ కావడం, సినిమా ఏకంగా కోయంబత్తూర్ లోకల్ ఛానల్‌లో ప్రసారం కావడం చిత్ర బృందాన్ని షాక్‌కు గురిచేశాయి. ఆ ఛానల్ యజమాని ఇప్పటికే అరెస్టు అయ్యారు. కోలీవుడ్ హీరో, టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రమిది.

## ఎట్టకేలకు 'పవర్ పేట'పై అధికారిక ప్రకటన.. ఆసక్తి రేకెత్తించేలా పోస్టర్






'పవర్ పేట' సినిమాపై గురువారం అధికారిక ప్రకటన వెలువడింది. సందీప్ కిషన్ హీరోగా ఈ చిత్రం తెరకెక్కనుంది. సందీప్ యాక్టింగ్ కెరీర్‌కు 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కొత్త సినిమా పోస్టర్‌ను టీమ్ విడుదల చేసింది. చెస్ బోర్డుపై రక్తపు మరకలు, ఎర్ర గులాబీతో డిజైన్ చేసిన పోస్టర్ సినిమాపై ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ప్రేమ, గౌరవం, రాజకీయం ప్రధానాంశాలుగా ఈ సినిమా తెరకెక్కనున్నట్లు అర్థమవుతోంది. కృష్ణచైతన్య దర్శకత్వం వహించే ఈ చిత్రానికి మణిశర్మ మ్యూజిక్ డైరెక్టర్. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. హీరోయిన్, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. ఓ ప్రియా ప్రియా, చిన్నదాన నీకోసం (ఇష్క్), గుండెజారి గల్లంతయ్యిందే తదితర హిట్ పాటలను రాసిన కృష్ణ చైతన్య 'రౌడీ ఫెలో'తో దర్శకుడిగా మారిన సంగతి తెలిసిందే. తర్వాత 'ఛల్ మోహన్ రంగ', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' తెరకెక్కించారు. ఎప్పటినుంచో 'పవర్ పేట'పై చర్చ నడుస్తోంది. చైతన్య ముందుగా ఈ సినిమాని నితిన్‌తో తెరకెక్కిస్తున్నట్లు గతంలో వార్తలొచ్చాయి. కానీ, అది కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో విశ్వక్‌సేన్ పేరు తెర పైకి వచ్చింది. దానిపైనా స్పష్టత రాకపోవడంతో.. సందీప్ కిషన్‌తో చేయనున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఎట్టకేలకు ఇప్పుడు అనౌన్స్‌మెంట్ వచ్చింది. సందీప్ విషయానికొస్తే.. 'ప్రస్థానం'తో ఆయన సినీ ప్రయాణం మొదలైంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.